# కురూపి

[గల్పిక]

ఆవిడ అనాకారి కాదుకాని బక్కచిక్కిన మనిషి. దవడలు బొత్తిగా అంటుకుపోయినై. కళ్లు విశాలమైనవైనా లోతుకు పోయినై. రొమ్ము ఎండిపోయింది. కాళ్లూ చేతులూ ఊచలే, నడుముకూ పిరుదులకూ వ్యత్యాసం లేకుండా ఒకటో అంకె లాగా ఉండేది.

ఆవిడభర్త తన ఈడువాళ్లనీ, తనకంటెచిన్నవాళ్లనీ, తన కంటె చాలా పెద్దవాళ్లనీ అనేకమందిని చేరదీసేవాడు. నిత్యమూ వారింటికి వస్తూఉన్నవారిలో అతను చాలా అంద గాడు. కుర్రవాడు. పాతికేళ్లు వెళ్లినవో లేవో. అతని దర్శనం ఏ ఆడదానికన్నా ఆనందం ఇవ్వగలగవచ్చు.అతను తనకేసి నవ్వితే ఏ ఆడదీ మరవలేదని పిస్తుంది.

అతనికి ఒకరిద్దరు ఆడవాళ్లతో సంబంధం ఉన్నట్టు ఆమె విన్నది. అందుచేత అతను బొత్తిగా ప్రవరు డనుకోవలిసిన అవసరంలేదు.

తన పరిశోధనకోసం ఆమె ఆ కుర్రవాణ్ణెన్నుకుంది.

ఆమె తనకేసి వింతగా చూడటం అతను త్వరలోనే గమ నించాడు. అతనికి కొత్తలో అసహ్యంవేసింది. ఎండిపోయిన ఆవిడ రొమ్మూ, నరాలుతేలిన ఆవిడ పొడుగాటి మెడా స్మరించుకుని నవ్వుకున్నాడు.

నాలుగైదురోజులు గడిచినతరవాత అకస్మాత్తుగా అతని హృదయంలో ఒకభావం మెరిసింది—ఆవిడ సన్నతనంలో

ఎంత నాజూకున్నది!

ఇటువంటి ఆలోచన కలిగినందుకతనికి ఆశ్చర్యం వేసింది. తను ఆ శవంలో ఏదో మంచి చూడగలగటం ఏమిటి? పుష్టి అయిన వక్షమూ, నిగనిగలాడే తొడలూ, కంఠమూ, పాలు గారే చెక్కులూ ఎరిగినతను—!

కాని ఆమె సన్నదనంలో ఏదో నాజూకు-సౌకుమార్యం —ఉన్నదనే ఆలోచన అతని తలలోనించి పోలేదు. పైగా మరింత ధృడం కాసాగింది.

ఒకనాడతను ఆమెకళ్లకేసి చూశాడు. అతని కప్పటి వరకూ ఆడవాళ్ళకళ్లల్లో తేడాలు తెలీవు. ఈకళ్లెంత అగాధంగా ఉన్నై! ఇతరుల కళ్ళల్లో ఏముంది? కనురెప్పలూ, కనుగుడ్డూ, నల్లగుడ్డూ, పాపం! ఈకళ్ళల్లో బ్రహ్మాండం తాలూకు రహస్యమంతా ఉంది!

ఆరోజల్లా అతని కాకళ్లు జ్ఞాపకం వస్తూనే ఉన్నై.

మరోరోజు ఆమే, ఆవిడభర్తా, అతనూమాత్రమే ఉన్నప్పుడు ఒకమాట అన్నది.

"ప్రేమలూ, గీమలూ చెప్పకండి. ఒకటే ప్రేమ ఉంది ప్రపంచంలో—పరమకురూపికి నవమన్మథుడిమీదా, నవమన్మథుడికి కురూపిమీదా కలిగేప్రేమ! అది అంటుకుంటే చల్లారదు. ప్రపంచాన్ని భస్మం చేస్తుంది. మిగిలిన ప్రేమలన్నీ ఇస్తిరివాయినం, పుచ్చుకుంటి వాయినం!"

అతను దద్దరిల్లిపోయినాడు, నాలుక పొడారింది. ఆమె భర్తకేసి చూశాడు.

ఆమెభర్తకూడా విస్మయపడ్డవాడల్లే మిగిలిన ఇద్దరికేసి

రెండుసార్లుచూసి పెద్దపెట్టున నవ్వాడు.

ఆవిడ తనచేతివేళ్ళకేసి చూసుకుంటూ నిశ్చలంగా కూచుంది.

అతని కారోజల్లా ఇంకో ఆలోచనేలేదు. ఆమెను ఒక్క-క్షణంకూడా మరవలేనట్టయింది. ఆమె చెప్పింది నిజం. ప్రేమతో పోలిస్తే కామం ఏపాటిది? ఎంత గోరు వెచ్చనిది! ఆమె తనను ప్రేమిస్తున్నది. తను ఆమెను ప్రేమించకుండా ఉండటం అసంభవం! గోగుపుడకలాటి ఆమెశరీరంలో రక్తం కాదు, అగ్ని ప్రవహిస్తున్నది. తను అదివరకెరిగిన ఆడవాళ్లు నీళ్ళకుండలు! అరటి బోదెలు! ఆవిడ హాలాహలం! అదే కావాలి తనకు.

ఆరాత్రి అతనికి ఆలస్యంగా నిద్రపట్టింది. కలవచ్చింది. ఆమెవచ్చి తనసరసనే పడుకుంది. ఆమెచేతులు తనచుట్టూ వెయ్యగానే తనశరీరంలో విద్యుత్తు ప్రవహించింది. ఆమె మొహానికేసి తనమొహం అదుముకుంటేగుచ్చుకున్నది.ఆమె కళ్ళల్లోకి చూస్తే గాఢాంధకారం, ఆగుడ్లల్లో ఏమీలేదు. మొహం వెనక్కు-లాగి చూచునుగదా తనపక్క-న పడుకుని తనచుట్టూ చేతులువేసినది మనిషి.కాదు——అస్థిపంజరం...

మర్నాడు అతను నూరుడిగ్రీల జ్వరంతో ఆమెను చూడ బోయినాడు. "నిన్నువిడిచి బతకలేను. నన్నుచంపకు. నువు నాదానివైతే నేను మరుక్షణం చావటానికైనా లెక్క-చెయ్యను," అని మనస్సులో ఆవిడతో అంటూ ఇంటో ప్రవేశించాడు,

ఆమె ఒంటరిగా ఉంది. అతనిజ్వరం మరో రెండుడిగ్రీలు

పెరిగింది. అతనినోరు స్వాధీనం తప్పింది. మహత్తరమైన శక్తి ఏదో తనని ప్రేరేపిస్తున్నట్టుగా అతను ఆమె పక్కనే కూర్చుని బెండువంటి ఆమెశరీరాన్ని దగ్గిరికి తీసుకుని కండ లేని ఆమెమూతి ముద్దుపెట్టుకున్నాడు. అతని మొహాన చెమట కాలవలు కడుతున్నది.

ఆమె ఈప్రణయ ప్రదర్శనానికి కంగారుపడ లేదు. చిరు నవ్వు నవ్వి, "చాలు, చాలు! నా అభిప్రాయం ఇదికాదు. మావారికి నన్నుచూస్తే ఒక దురభిప్రాయం! నే నెవ్వరికీ అక్కర్లేదని! నన్ను వీధిలోపారేస్తే నల్లకుక్కయినా ముట్ట దని! ఈయన పొరపాటుపడ్డట్టు కనిపిస్తుంది! ఆవిషయం ని న్నడిగి అనుమానం రహితం చేసుకుందామనుకుంటుండగా, దేవుడల్లేవచ్చి నువ్వే నా అనుమానం తీర్చావు. నన్ను బాధించకు. నాకు మావారిమీదతప్ప మరెవ్వరిమీదా భ్రమలేదు!" అన్నది.